రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## కాసాగ్రాండ్ డెవలపర్స్‌పై ఏజీ కాలనీవాసుల ఆరోపణలు

**-రోడ్లు, డ్రైనేజీ ధ్వంసం చేశారని ఆవేదన**

**మేడ్చల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని ఏజీ కాలనీవాసులు కాసాగ్రాండ్ డెవలపర్స్ తీరుపై ఆందోళన వ్యక్తంచేశారు. కాసాగ్రాండ్ డెవలపర్స్ చేపడుతున్న పనుల కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను ధ్వంసం చేశారని, ప్లాట్ల హద్దులను సూచించే హద్దురాళ్లను తొలగించారని కాలనీవాసులు ఆరోపించారు. కాలనీపరిధిలో విద్యుత్ అనుమతులు లేకుండానే 11కెవి విద్యుత్‌లైన్‌ను ప్రమాదకరంగా ఏర్పాటుచేశారని దీంతో తాము నివసిస్తున్న ఏజీ కాలనీలో విద్యుత్‌లైన్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు తక్షణమేస్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి డెవలపర్స్‌పై చర్యలుతీసుకోవాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, కార్యదర్శి ఎపిరావు, ఉపాధ్యక్షుడు పద్మారెడ్డి, సంయుక్త కార్యదర్శి సుభాష్‌రెడ్డి, కోశాధికారి జయసేనారెడ్డి, కమిటీసభ్యుడు ప్రదీప్‌రెడ్డి, కాలనీవాసులు కోరారు.

## మహబూబ్ సుభాని దర్గా పునర్నిర్మాణానికి డిమాండ్..

**-ఈనెల 21న నిరసన**

**-హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా, చర్యలు శూన్యం: మైనార్టీ నాయకుడు ఎస్.ఎం.గౌసన్**

**కొడంగల్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

కొడంగల్‌లోని మహబూబ్ సుభాని దర్గా పునర్నిర్మాణానికి సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ముస్లిం మైనార్టీల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతుందని, 2025 సెప్టెంబరు 21న అర్ధరాత్రి దర్గాను తొలగించారని, అప్పటినుంచి పునర్నిర్మాణం కోసం అధికారులను పలుమార్లు కోరినా, స్పందనలేదని మైనార్టీ నాయకులు ఎస్.ఎం.గౌసన్ అన్నారు. జాప్యంవల్ల ముస్లింల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణ మే అమలుచేయాలని డిమాండ్‌చేస్తూ, దీనికి నిరసనగా ఈ నెల 21న (సోమ వారం) కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో ముస్లిం మైనార్టీలతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## వాగులోకి దూసుకెళ్లిన కారు, ఇద్దరికి తీవ్ర గాయాలు

**ధారూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని బాచారం వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గణేష్‌నిమజ్జన కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరులో జరిగిన గణేష్‌నిమజ్జన వేడుకలకు హాజరైన తాండూరు మండలం రాఘవాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కారు (టిఎస్ 08 జెఎన్ 3859)లో హైదరాబాద్ వైపు తిరిగి ప్రయాణ మయ్యారు. మార్గంమధ్యలో ధారూర్ మండలపరిధిలోని బాచారం మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పింది. పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టడంతో, కారు అదుపుతప్పి పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరువ్యక్తులకు తీవ్ర గాయాల య్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న ధారూర్ సిఐ రఘురాములు వెంటనే తనసిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మందలింపుతో మనస్తాపం చెంది బాలుడి ఆత్మహత్య

**షాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

షాబాద్‌మండలం అంతారంగ్రామానికి చెందిన 16ఏళ్ల బాలుడిని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అంతారం గ్రామానికి చెందిన జిట్టా చంద్రశేఖర్(16), తండ్రి లక్ష్మయ్య గొర్రెలకాపరిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై పంటపొలంలో చెట్టుకు చంద్రశేఖర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు షాబాద్ పోలీసులు తెలిపారు.

## పెద్దమ్మకాలనీలో ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

శామీర్‌పేటలోని పెద్దమ్మకాలనీలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం శామీర్‌పేటలోని పెద్దమ్మకాలనీలో ఈ సంఘటన చోటు చేసుకుంది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం స్థానిక పెద్దమ్మకాలనీలో నివాసం ఉంటున్న కురుమన్న(56) అనే వ్యక్తి ఇంటిముందున్న రేకులపైప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు పేర్కొన్నట్లు తెలిపారు. అయితే ఆత్మహత్యకుగల కారణాలు మాత్రం.. అనారోగ్యంతో ఉంటూ మనస్తాపంతో ఉండి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

బొమ్మరాసిపేట్ గ్రామ సమీపంలోని వ్యవసాయపొలం వద్ద ఉన్న గదిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ గ్రామ పరిధిలో జరిగింది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం తూంకుంటలో నివాసం ఉంటున్న వేశ్న ఆనంద్‌వర్మ (41) బొమ్మరాసిపేట్ గ్రామ పరిధిలో ఓ పొలాన్ని లీజ్‌కు తీసుకుని వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పొలానికి వెళ్లి తిరిగి రాలేదని సాయంత్రం వరకు వేచిచూసినట్లు ఆ తరువాత అతని భార్య ఆమె తమ్ముడిని పొలం వద్దకు వెళ్లి చూసిరమ్మని పంపినట్లు తెలిపారు. అయితే పొలం వద్ద ఉన్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నట్లు చూసి వెంటనే అతను అక్కకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు, అందువల్లనే మనస్తాపం చెంది వేశ్న ఆనంద్‌వర్మ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య ఫిర్యాదులో పేర్కొనటం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆయన స్వగ్రామం భీమవరం అని, అయితే గత ఇరవై ఏళ్ల కిందటనే బతుకుతెరువు కోసం శామీర్‌పేట మండలానికి ఆంధ్రనుంచి వచ్చినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఆయన మనస్తాపంతో పొలంవద్ద ఉన్న గదిలో ఉరివేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**శంషాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

పాలమాకుల గ్రామ పరిధిలోని రేస్‌గ్రాండ్ ధాబా సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సిఐ సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా భూత్‌ముగ్గి గ్రామానికి చెందిన మాధవ్ టెటరావ్ చవాన్ (33) జడ్చర్లలోని ఓ ఫార్మా కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు ప్రశాంత్ జ్ఞానేశ్వర్ ఉన్సనాలేతో కలిసి జడ్చర్ల నుంచి హైదరాబాద్‌లోని బుద్వేల్‌కు వచ్చి తిరిగి బైక్‌పై జడ్చర్లకు బయలుదేరారు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం 4గంటల సమయంలో పాలమాకుల పరిధి లోని రేస్‌గ్రాండ్ దాబా వద్ద ప్రశాంత్ బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైనచికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తర లించారు. చికిత్సపొందుతూ మాధవ్ రాత్రి 10.40గంటల సమయంలో మృతిచెందినట్లు వైద్యు లు తెలిపారు. ప్రశాంత్ తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్నాడు. మృతుడిబంధువు విట్టల్ ధన్‌రాజ్ చవాన్ ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

## మైనర్‌ను కాదు, మేజర్‌నే పెళ్ళి చేసుకున్నా..

**-నాపై వస్తున్న ఆరోపణలో వాస్తవంలేదు: బంటు అనిల్**



ధృవీకరణ పత్రాలను చూపుతున్న బంటు అనిల్

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

మైనర్‌ను కాదు మేజర్‌నే తాను పెళ్ళి చేసుకున్నానని, తనపై వస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని పెద్దేముల్ మండలం గొటపల్లి గ్రామానికి చెందిన బంటు అనిల్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బంటు అనిల్ మాట్లాడుతూ తాను ఆకుల నందినిని మైనర్‌గా ఉన్న సమయంలో వివాహం చెసుకున్నట్లు, అలాగే కళ్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవంలేదని అన్నారు. 2025 మార్చి2న తమ వివాహం జరిగిన నాటికి తన భార్యకు 18 సంవత్సరాలు పూర్తయ్యాయని అన్నారు. ఆమె పుట్టిన తేది 16-8-2006 అని వివాహ సమయానికి ఆమె వయసు 18 సంవత్సరాల 6 నెలలకు పైగా ఉందని పేర్కొన్నారు. తమ వయసుకు సంబంధించిన ఆధారాలు ప్రభుత్వం జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఆసుపత్రిలో ఇచ్చిన పత్రాలు తమవద్ద ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే తమ వివాహం జరిగిందని స్పష్టంచేశారు. కుటుంబంలో ఆరోగ్యపరమైన సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు కారణంగా కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని అధికారులను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశం తమకు ఏమాత్రంలేదని, తమ కుటుంబపరిస్థితిని చూసి మానవతాదృక్పథంతో తమకు సహాయం అందించాలని బంటు అనిల్ కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

# 'కడా' పనులకు కదలిక

**-అగ్గనూరు-మైల్వార్ డబుల్ రోడ్డు వేగవంతం**
**-రూ.100 కోట్లతో 25 కిలోమీటర్లు విస్తరణ**



వేగంగా సాగుతున్న అగ్గనూర్-మైల్వార్ రోడ్డు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) పనులకు మళ్లీ కదలిక వచ్చింది. రూ.100కోట్ల వ్యయంతో తాండూరు సెగ్మెంట్‌లోని రెండు మండలాల మీదుగా కొడంగల్ నియోజకవర్గానికి అనుసంధానం చేస్తూ రోడ్డు విస్తరణ పనులు వేగవంతమైనాయి. ఏడాది క్రితం ప్రారంభించిన పనులు కొంత కాలంగా మందగించాయి. ఇటీవల ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. ఫలితంగా కాంట్రాక్టర్లు పనులపై ధ్యాసపెట్టారు. ఆర్‌అండ్‌బి తాండూరు డిఈ శ్రవణ్‌కుమార్, సహాయ ఇంజనీరు రిషివరుణ్ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

కడా నిధుల ద్వారా పనులు చేపడితే సకాలంలో బిల్లులు చేతికి అందుతాయని కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు. యాలాల మండలం అగ్గనూర్ గ్రామం నుంచి బషీరాబాద్ మండలం మైల్వార్ వరకు 25కిలోమీటర్ల రహదారిని విస్తరిస్తున్నారు. 2011 వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న బషీరాబాద్ రహదారిని అప్పట్లో మంత్రి ప్రసాద్‌కుమార్ (ప్రస్తుత స్పీకర్) డబ్లింగ్‌కు నిధులు ఇచ్చారు. 2013 వరకు పనులు పూర్తిచేశారు. అయితే, బషీరాబాద్ నుంచి మైల్వార్ వరకు ఇప్పటికీ సింగిల్ రోడ్డు ఉంది. 2025లో రూ.150 కోట్ల కడా నిధులనుకేటాయించారు. అందులో రూ.50కోట్లు ఖర్చుచేసి కొడంగల్ నియోజకవర్గంలో వివిధపనులు జరుగుతున్నాయి. మిగిలిన 100కోట్ల రూపాయలతో అగ్గనూరు-మైల్వార్ రోడ్డువిస్తరణ పనులు చేపట్టారు. ఇప్పటివరకు 40శాతం రోడ్డుపనులు పూర్తయ్యాయి. తొలిదశలో మైల్వార్ నుంచి బషీరాబాద్ వరకు బిటి పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పనుల పట్ల స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

కర్ణాటక సరిహద్దునగల తాండూరు అసెంబ్లీ నియోజకవర్గానికి రహదారులు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉన్నది. గుల్బర్గా, యాద్గిర్ జిల్లాలకు ఆనుకుని ఉన్న బషీరాబాద్ మండలానికి వెళ్లేందుకు సరైన రోడ్డుసౌకర్యంలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ గతుకుల రోడ్డుపై వెళుతుంటారు. ఆర్టీసీబస్సు సౌకర్యంలేదు. వ్యక్తిగత వాహనాలు, ఆటోలద్వారా కర్ణాటకకు రవాణా చేపడుతున్నారు. ఈ లింక్‌రోడ్డు వల్ల సమీప భవిష్యత్‌లో రవాణా సేవలు మెరుగుపడనున్నాయి. బషీరాబాద్, తాండూరు మార్కెట్లకు వచ్చేందుకు రైతులు, వినియోగదారులకు ఉపయోగకరంగా మారుతుంది.

**నాలుగునెలల్లో పూర్తిచేస్తాం: ఆర్‌అండ్‌బి డిఈ శ్రవణ్**

ఈ రోడ్డును నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బి డిఈ శ్రవణ్ తెలిపారు. సిఎం జిల్లా కావడంవల్ల రోడ్డుపనులు వేగవంతంగా, నాణ్యతాయుతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయని ఆయన వివరించారు.

# ఎస్ఐఆర్ విధులు పకడ్బందీగా నిర్వహించాలి

**-అదనపు కలెక్టర్ వెంకటాచారి**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటచారి

**వికారాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

సర్ విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటచారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిధిలో ఎస్ఐఆర్ విధుల నిర్వహణపై సిడిపిఓలు, సూపర్ వైజర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ విధులను అంగన్‌వాడీ టీచర్లు సక్రమంగా విధులు నిర్వహించేలా పర్యవేక్షించడం సూపర్‌వైజర్ల ప్రధాన బాధ్యత అని అదనపు కలెక్టర్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అంగన్‌వాడీ టీచర్లపై, ముఖ్యంగా జీరో శాతం పురోగతి ఉన్నవారిపై, నిబంధనల ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే 15రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా సిడిపిఓలు, సూపర్‌వైజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వచ్చే నెల 7వ తేదీలోగా పూర్తి స్థాయిలో ఎస్ఐఆర్ విధులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పదిమంది బిఎల్ఓలకు ఒక సూపర్‌వైజర్‌ను కేటాయించినట్లు తెలిపారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసే సమయంలో బిఎల్ఓ తప్పనిసరిగా ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. నోటీసును తిరిగి ఓటరుకు అందజేసే సమయంలో అవసరమైన ధృవీకరణ పత్రాలను జతచేసి బిఎల్ఓకు సమర్పించేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమశాఖ అధికారి కాంతారావు, డిఆర్ఓ స్వర్ణలత, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన తాటిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్



కేంద్ర మంత్రితో సర్పంచ్, బిజెపి నాయకులు

**యాచారం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

యాచారం మండలపరిధిలోని తాటిపర్తిగ్రామంలోని అతిపురాతన తాటికుంట మైసమ్మ దేవాలయాన్ని పునఃప్రారంభించాలని కోరుతూ బిజెపి రాష్ట్ర నాయకులు కొప్పు భాష ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆలయంలో విగ్రహం చోరీ జరిగిన అనంతరం ఆలయం మూసివేయబడిన విషయాన్ని, భక్తులు పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, వెంటనే జిల్లా అటవీ అధికారి డిఎఫ్ఓకు ఫోన్ చేసి మాట్లాడారు. వీలైనంతత్వరగా గుడిని పునఃప్రారంభించేందుకు చర్యలుతీసుకోవాలని డిఎఫ్ఓని ఆదేశించారు. మంత్రి సానుకూల స్పందన పట్ల సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, గ్రామప్రజలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వార్డ్‌మెంబర్స్ ఏనుగొండ శ్రీశైలం, యాచారం మలేష్, బిజెపి నాయకులు బొక్క బాలవర్ధన్ రెడ్డి, మండల్ కార్యదర్శి కానుగుల కృష్ణ, ఆడాల వెంకటయ్య పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన



కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

**ఆమనగల్లు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ క్రషర్ అండ్ మైనింగ్ అనుమతులను రద్దు చేసి కేంద్రాన్ని ఎత్తివేయాలని ఆమనగల్లు గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొని నిరసన వ్యక్తంచేశారు. పురుషులతోపాటు మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అక్రమ మైనింగ్ వ్యతిరేక ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి మైనింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొన్నది. చాలాసేపటి వరకు అక్కడే బైఠాయించి ఆందోళన సాగించడంతో ఒకానొక సందర్భంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మైనింగ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తంచేశారు. అంతకుముందు జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ఆకుతోటపల్లి గ్రామపంచాయతీలోని సర్వేనెంబర్ 304 భూమిలో అక్రమంగా క్రషర్ అండ్ మైనింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వారు ఆందోళన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 22ఏ లో ఉన్న భూమిలో మైనింగ్ కేంద్రాన్ని నిర్వహించడం ఎంతవరకు సబబని ఆందోళనకారులు ప్రశ్నించారు. పంచాయతీ అనుమతులు లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, ఎన్‌ఓసి పత్రాలు లేకుండానే మైనింగ్ ఏర్పాటు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యగా వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆకుతోటపల్లిలో ఏర్పాటుచేసిన మైనింగ్ కేంద్రం అనుమతులను వెంటనే రద్దుచేసి ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, శ్రీపాతి పుల్లారెడ్డి, శ్రీపాతి శశిధర్‌రెడ్డి, సింగం శీనయ్య, నిట్ట నారాయణ, వి.వీరేష్‌గౌడ్, హాజీ పాషా, వట్టికోట కృష్ణ, రాంచంద్రయ్య, కొప్పుల శేఖర్, బాలరాజ్, ఉపసర్పంచ్ ఓర్సు శ్రీను, వార్డ్‌సభ్యులు బాలు, సాజీద్, డికె, విజయ్, కొమురమ్మ, స్వరూప, నర్సింహా, సాలమ్మా, శరత్, సీనియర్ నాయకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీలో సత్తాచాటిన మంబాపూర్ విద్యార్థులు




బహుమతిని అందుకుంటున్న మంబాపూర్ టీమ్ సభ్యులు

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

పెద్దేముల్ మండలం మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు కబడ్డీలో సత్తాచాటారు. శనివారం ధారూర్ మండలం నాగవరం జడ్‌పిహెచ్‌ఎస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీల్లో పెద్దేముల్ మండలం మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు విన్నర్‌గా, అండర్-14 కబడ్డీ పోటీల్లో మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచి తమ సత్తాచాటారు. ఈ సందర్భంగా పిఈటి క్రిష్ణయ్య మాట్లాడుతూ మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీలో తమ తమ సత్తాలు చాటి పాఠశాలకు మంచి పేరుప్రతిష్ఠలు తీసుకువచ్చారని అన్నారు. మునుముందు కూడా జిల్లాస్థాయిలో రాణించేందుకు తమవంతు కృషి చేస్తానని అన్నారు. జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు కబడ్డీలో విజేతలుగా నిలిచినందుకు హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

# ఆమనగల్లును అభివృద్ధిచేస్తాం..

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

నియోజకవర్గ పరిధిలోని కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపాలిటీలను అన్నివిధాలుగా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకుసాగుతున్నట్లు కల్వకుర్తి నియోజకవర్గ శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మౌలిక వసతులతోపాటు ఇతర అభివృద్ధిపనులను చేపట్టేందుకు నిరంతరం కృషిచేస్తున్నట్లు ఆయన వివరించారు. నగరాభివృద్ధి నిధుల క్రింద మంజూ రైన రూ.2కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, మార్కెట్‌కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ్మాతో కలిసి శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి శంఖుస్థాపన చేశారు. ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, పన్నెండు వార్డులలో సిసిరోడ్లు, అండర్‌డ్రైనేజీల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈసందర్భంగా 9వవార్డులో శ్రీకాంత్‌కాలనీ ముఖద్వారంవద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్మన్ పత్యానాయక్ అధ్యక్షతన ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి నిధులు కోరుతున్నట్లు తెలిపారు. పలు అభివృద్ధిపనులకు ఇప్పటికే రూ.20 కోట్ల ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోగా వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి మంజూరైన రూ.15కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ మొదలైందన్నారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, పాపిశెట్టి రాము, ఎనుమల రమేష్, దుద్దు ఆంజనేయులు, నాగిళ్ళ జగన్, అనిత, కో-ఆప్షన్ సభ్యులు అల్లాజీగౌడ్, ఖాదర్, కండె సీతమ్మ, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి, మేనేజర్ ఆంజనేయులు, మండలాధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు అవ్వారి శివలింగం, సీనియర్ నాయకులు గుర్రం కేశవులు, మాజీ వైస్‌ఎంపిపి నిట్ట నారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, కృష్ణనాయక్, మానయ్య, అలీమ్, కండె భాస్కర్, పులికంటి మైసయ్య, విజయ్, రహీం, కరీం, అలీమ్, కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో వెలుగులు నింపేది ఉపాధ్యాయులే

**-ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి**



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు

**షాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

సమాజంలో అజ్ఞానం అనే చీకటినితొలిగించి వెలుగులునిపేది ఉపాధ్యాయులే అని, పవిత్రమైన వృత్తికి న్యాయంచేస్తేనే అభివృద్ధి సాధ్యమౌతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానసభను నిర్వహించారు. ఈసందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులు 16మందిని ఘనంగా సన్మానించారు. పాఠశాలలో సంఖ్యాపరంగా ఉపాధ్యాయుల సంఖ్య గుదిబండగా మారిన జీవో నెంబర్ 25ను ఎత్తివేయాలని ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈవిషయాన్ని సిఎందృష్టికి తీసుకుపోతామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, సర్పంచులు అశోక్, రాజేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాల్రాజ్, కృష్ణారెడ్డి, శేఖర్‌గౌడ్, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయకుడికి ప్రత్యేక థీమ్ రూపకల్పన

**గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:**
ఉద్యోగుల జీవితకాల సేవకు, గౌరవం పదవీ విరమణ అనంతరం పెన్షన్ ద్వారా భద్రత గౌరవప్రదమైన జీవనానికి ప్రతీకకు వినాయకుడి ప్రత్యేక థీమ్‌ను రూపొందించారు. జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని పెన్షన్‌పేమెంట్ ఆఫీసులో ఈ విన్నూత గణేష్ అలంకరణనుఏర్పాటు చేశారు. ఈ అలంకరణను తీర్చిదిద్దారు. విఘ్నాలను తొలగించే వినాయకుడ్ని ప్రతి పెన్షనర్‌కు శాంతి, ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సు ప్రసాదించాలని ఆకాక్షించారు. భక్తులను విశేషంగా ఈ పెన్షర్ వినాయకుడు ఎంతో ఆకట్టుకుంది.

## సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ శతాబ్ది ఉత్సవ వేడుకలు ప్రారంభం

**అఫ్జల్‌గంజ్ సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:**
శతాబ్ది కాలంగా ఆధ్యాత్మికత, విశ్వాసం, సోదరభావం, నిస్వార్థ సేవలకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నసందర్భంగా ఈనెల 19 ఘనంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 1926లో స్థాపించబడిన ఈ గురుద్వారా హైదరాబాద్ సామాజిక, ఆధ్యాత్మిక, ప్రస్థానంలో శతాబ్ది కాలంగా అంతర్భాగంగా కొనసాగుతుంది. ప్రార్ధన మందిరంగా ప్రారంభమైన గురుద్వారా కాలక్రమంలో సిక్కు, సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రంగా సేవా కార్యక్రమాలకు వేధికంగా ఎదిగింది. విశ్వాసం, సమానత్వం, సోదరభావం, సేవభావం వంటి సిక్కు మత విలువలను తరతరాలకు అందిస్తూ వస్తోంది. సెంట్రల్‌గురుద్వారా సాహిబ్ గౌలిగూడ ప్రభందకకమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ సిక్కు గురుద్వారాల సహకారంతో ఈ శతాబ్ది వేడుకలను నిర్వహిస్తున్నారు. శతాబ్ది వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ 20వ తేదిల్లో పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహిబ్ ప్రభంధక్ కమిటి అధ్యక్షులు ఎస్. త్రిలోక్ సింగ్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో ప్రధాన కార్యక్రమమైన విశాల్‌దివాన్('భారీమత సమ్మేళనం) ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతుందన్నారు. ఢిల్లికి చెందిన బాయ్ జగ్జీత్‌సింగ్ బాబిహా, లూధియానాకు చెందిన బాయ్ బల్‌ప్రీత్‌సింగ్, బాయ్‌జగ్‌ప్రీత్‌ఖన్నేవాలే విశాల్ దివాస్ ప్రవచనలు చేస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సిక్కులు కుటుంబసమేతంగా తరలివస్తారన్నారు.

## నృత్య, సాహిత్య ప్రముఖులకు ఇట్ క్లా తెలుగు వెలుగు పురస్కారాలు

**చిక్కడపల్లి సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :**
మూడు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో తెలుగు భాష, సంస్కృతి, కళారంగాల వ్యాప్తికి కృషి చేస్తున్న సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్ క్లా) అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న మహిళా ప్రముఖులకు ఇట్ క్లా తెలుగు వెలుగు పురస్కారాలను అందజేసి గౌరవించారు. ప్రముఖ కూచిపూడి నర్తకి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖ డీన్ డాక్టర్ వనజ ఉదయ్, సాహితీవేత్త, దూరదర్శన్ యాదగిరి కార్యనిర్వహణాధికారి కె. కామేశ్వరి ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అవార్డుల కమిటీ చైర్మన్ రేలంగి నరసింహారావు, ఇట్ క్లా అమెరికా అధ్యక్షుడు కళ్యాణచక్రవర్తి, నన్నపనేని రాజకుమారి, పి. విజయబాబు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ కొలకలూరి ఇనాక్, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ అనుమాండ్ల భూమయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.
నులు పెద్ద సంఖ్యలో పాల్గొని అక్కినేని కి నివాళులర్పించారు.

## పల్లె చెరువులో నిమజ్జన ఏర్పాట్లు అంతంతే..!



**అత్తాపూర్ సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**
గణేష్ నిమజ్జన ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు శనివారం పరిశీలించారు. అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల బీఆర్ఎస్ ఇన్‌చార్జి కోలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లె చెరువు, పత్తికుంట చెరువులను పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. నిమజ్జనం కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పల్లె చెరువులో ఏర్పాట్లు భక్తులకు ఇబ్బందులు కలిగించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిమజ్జనానికి ముందే చెరువుల్లోని గుర్రపుడెక్క తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేవారని, భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లు, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచేవారని తెలిపారు. ప్రస్తుతం పల్లె చెరువులో పది విగ్రహాలు కూడా సక్రమంగా నిమజ్జనం చేయలేని విధంగా చిన్న కొలను ఏర్పాటు చేశారని ఆరోపించారు. పల్లె చెరువు, పత్తికుంట వద్ద క్రేన్ల సంఖ్య పెంచాలని, తాగునీరు, వైద్య సిబ్బంది, వర్షం, ఎండ నుంచి భక్తులకు రక్షణ కల్పించే ఏర్పాట్లు చేయాలని సుభాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కాటే దాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్, మాజీ కౌన్సిలర్ రమేష్ ముదిరాజ్, మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్, హైదరగూడ అధ్యక్షులు నరేందర్ ముదిరాజ్, రాము యాదవ్, మైసిరెడ్డి రాఘు యాదవ్, రాజేష్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం, జగదీష్, రామస్వామి జంపుల భగవాన్ దాస్ చిరంజీవి, ఉమారెడ్డి, తిరుపతి రెడ్డి, పచ్చ శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్ క్రాంతి సింహాచలం రిషి తదితరులు ఉన్నారు

## మాతృభాషను ఎప్పుడూ మరచిపోవద్దు



**అత్తాపూర్ సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**
జ్ఞాన సరస్వతి ఫౌండేషన్, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఉపాధ్యాయ పండిత పరిషత్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల విద్యార్థులకు మండల స్థాయిలో పద్యాల తోరణం కార్యక్రమం రాజేంద్రనగర్ మండల స్థాయి పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అత్తాపూర్ లో సరస్వతి దేవి పూజ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శీలత సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. తెలుగు భాష పట్ల దినదినానికి తగ్గుతున్న ఆదరణ బాధ కలిగిస్తుందని నిజానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు ప్రత్యేక అభినందనలు. మనమందరం తేనెలాంటి మధురమైన మాతృభాషను ఎప్పుడూ మరచిపోవద్దని అన్నారు. మైలార్దేవ్ పల్లి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు శ్రీనివాస సాగర్, బాలకృష్ణ, యాదిలాల్, సత్యన్న, సరిత, లింగరాజు లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు రజియా బేగం, సాయి ప్రసాద్ రావు, రోజారాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నందినగర్‌లో వినాయక మండపంలో అరవింద్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, ఎస్టీ సెల్ చైర్మన్ బాబా నాయక్, భల్లు తదితరులు



పంజాగుట్టలో గణేష్ మండపంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, మహేష్ యాదవ్, జెజోళ్ల రాజు తదితరులు



హుడా కాలనీలో ఏబీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మిరియాల ప్రీతమ్



సికింద్రాబాద్ మెండా మార్కెటట్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఎమ్మెల్యే పద్మా రావు గౌడ్, అధికారులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేణు గోపాల్, జి.వి రామణ రావు, ఎడిఈ శివ దుర్గప్రసాద్, ఆది నారాయణ రావు, శివ రామకృష్ణ, దర్గేష్, తదితరులు పాల్గొన్నారు.



బూసరెడ్డి గూడలో ప్రతిష్టించిన గణేష్ మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, కాంగ్రెస్ నేత సన్నీ యాదవ్



బోయిన్‌పల్లి గణేష్ మండపంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు



విశ్వకర్మ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు



కూకట్‌పల్లి గణపతి మండపాల వద్ద పూజలు నిర్వహిస్తున్న బండి రమేష్



హైదర్షాకోట్ డివిజన్ ఇండస్ వ్యాలీ గణపతి వద్ద రామాయణంలోని కిస్కిందకాండ నాటకను ప్రదర్శిస్తున్న చిన్నారుల దృశ్యం.



ఆదిత్య నగర్‌లో ప్రత్యేక పూజలో పాల్గొన్న రాష్ట్ర బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



రామ్ నరేష్ నగర్‌లో ఎద్దుల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజలో పాల్గొన్న బిజెపి అధికార ప్రతినిధి ఎం రవికుమార్ యాదవ్

# గల్లీ గల్లీలో గణేషుడికి పూజలు

## సంస్కారమైన సమాజానికి కళలు అవసరం : ఎంపి ఈటల రాజేందర్



**చిక్కడపల్లి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** నేడు ఆర్థిక అభివృద్ధి కన్నా మానవ సంబంధాలు కలిగిన సంస్కార వంత సమాజం అవసరం ఉందని పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. సంస్కారవంత సమాజానికి కళలు అవసరం అని చెప్పారు సంగీతం మనసులోని ఒత్తిడి తగ్గించే శక్తి ఉందని తెలిపారు. శనివారం జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి మహోత్సవం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షులు ఎల్. వి. చెన్నారావు అధ్యక్షత వహించారు. సుభాని నాద స్వరం డి ఎస్ ఎన్ మూర్తి బృందం మృదంగ వాయిద విన్యాసం రమాదేవి శిష్య బృందం నాట్య అంశాలు తో మనోహరం గా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈటల రాజేందర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ జీవిత సాఫల్య పురస్కారం శాస్త్రీయ సంగీత గాయని హరి ప్రియ కు నాద జ్ఞాన రత్నాకరీ బిరుదు ను మృదంగ విద్యాంసుడు డి శ్రీరామ మూర్తి కి శబ్ద జ్ఞాన రత్నా కర్ బిరుదును బహుకరించి మాట్లాడారు. బాల మురళీ కృష్ణ వంటి మహనీయులు అందించిన కళా వార సత్వ సంపద ముందు తరాలకు అందించాలనీ అందుకు చెన్నారావు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం అన్నారు కానీ నేడు తిట్లు రాజకీయాలు నడుస్తున్నాయని పత్రికలు కూడా తిట్ల దండకం కె ప్రాధాన్యత ఇస్తున్నారనీ అయన వాపోయారు. హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి మాట్లాడుతూ బాల మురళి కృష్ణ విఖ్యాత గాయకుడు తెలుగు వారు ఇనందుకు గర్వించాలి అన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి దేవి మాట్లాడుతూ వైద్యుడు శరీర రోగాలు నయం చేస్తారు కానీ సంగీతం మానసిక రోగాలు తగ్గిస్తుంది అన్నారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు హరిప్రియ కి, ప్రముఖ మృదంగ సామ్రాట్ డాక్టర్ ధూళిపాళ శ్రీరామ మూర్తి కి పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జీవన సాఫల్య పురస్కారం అందజేసి సత్కరించారు. ఈ వేడుకలో సుప్రసిద్ధ కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు కళారత్న డి.వి. మోహన కృష్ణ బృందం, ఎస్. ఎమ్. మాండొలిన్ సుభాని బృందం సంగీత కచేరీలు నిర్వహించగా, నాదస్వర బృందం కచేరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



బండ్లగూడ డివిజన్ సంధ్యానగర్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజెన్స్.

**నార్సింగి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** బండ్లగూడ డివిజన్ సంధ్యానగర్ కాలనీలో మౌళిక వసతులు మెరుగు పర్చాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌కు సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు వినతి పత్రంను సమర్పించారు. మాజీ కార్పొరేటర్ బి.సాగర్ గౌడ్ నాయకత్వంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆరెమైసమ్మ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్‌రావ్, ప్రధాన కార్యదర్శి ఆనందరావ్‌లు మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ గ్రామ పంచాయతీలో, కార్పొరేషన్‌లో వేగంగా ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేవన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసిన తరువాత కనీస వసతులైన మంచినీరు, డ్రైనేజి, వీధి దీపాల నిర్వాహణ ఘోరంగా మారిందన్నారు. నెలల తరబడి సంధ్యానగర్ కాలనీలో మంచినీరు సవ్యంగా సరఫరా అవడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని జల మండలి అధికారులకు, డిసికి వినతిపత్రంను అందజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వీలైనంత త్వరగా మా ప్రాంతంలో తాగునీరు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకున్నామని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందిస్తూ మీ సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారమ య్యేలా చూస్తానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే హామీపట్ల సీనియర్ సిటిజెన్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పట్ల ఇంత వేగంగా స్పందించడం వల్లనే వరుసగా 4. మార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారని తెలిపారు.

## నర్సింగ్ అనేది దైవత్వంతో నిండిన వృత్తి : కేశవరావు



నర్సింగ్ విద్యార్థుల స్నాతకోత్సవ సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహదారు కేశవరావు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** నర్సింగ్ అనేది దైవత్వంతో నిండిన వృత్తియని, రోగులకు కరుణ, దయ అంకితభావంతో సేవ చేయటం గొప్పవిషయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహదారు కే. కేశవరావు అన్నారు. చందానగర్‌లోని మహిళా దక్షత సమితి, బన్సిలాల్ మలాని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఐదవ బ్యాచ్ బీఎస్‌సి నర్సింగ్ విద్యార్థుల ఐదవ బ్యాచ్ పట్టబద్రుల స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మందికి పైగా విద్యార్థులు తమ కోర్సును విజయవంతంగా పూర్తిచేసుకుని పట్టా పొందారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, హైదరాబాద్ కిమ్స్ అసుపత్రి జీఐ, హెచ్‌పిబి సర్జరి సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్, అకడమి డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఏ శాస్త్రీ, యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ అంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మర్ధాలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి స్నాతకోత్సవ కార్యక్రమంలో పట్టబద్రులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్బంగా జరిగిన సమావేశంలో కేశవరావు మాట్లాడుతూ. నర్సులు రోగులకు చికిత్స చేయటమే కాకుండా రోగుల్లో ఆత్మవిశ్వాసం, మానసిక మద్దతు అందించటంలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. నర్సింగ్ వృత్తి సాంకేతిక పరిజ్ఞానానికి మించినదని, దానికి కరుణ, సహనం, అవగాహన, ప్రగాఢమైన బాధ్యతాభావం అవసరమన్నారు. మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు సరోజ్ బజాజ్ మాట్లాడుతూ. మహిళా దక్షత సమితి ఆధ్వర్యంలో బీఎస్‌సీ నర్సింగ్ ఐదవ బ్యాచ్ విద్యార్థులు పట్టభద్రులవ్వడం తమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా దక్షత సమితి సభ్యులు, బన్సిలాల్ మలాని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల అధ్యాపక సిబ్బంది, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం ఎస్సీ,ఎస్టీ బిసిలు ఐక్యంగా పోరాడాలి : తీగల ప్రదీప్ గౌడ్




**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సామాజిక అసమానతలు, రాజకీయ ఆధిపత్య ధోరణులకు ముగింపు పలికి సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం సాధించేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని మహాజనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్ పిలుపునిచ్చారు. మహాజనసేన పార్టీ ఆవిర్భవించి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదన్నారు. కొన్ని ఆధిపత్య సామాజిక వర్గాలు రాజకీయ, ఆర్థిక బలంతో తమ ప్రభావాన్ని కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. తాను ఏ సామాజిక వర్గానికీ వ్యతిరేకం కాదని, తమ వర్గాలపై జరుగుతున్న వివక్ష, అన్యాయాన్ని మాత్రమే ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు వివిధ సామాజిక వర్గాల నాయకత్వాలను తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. రాజకీయాలకు దూరంగా ఉండే యువత సామాజిక, రాజకీయ మార్పు కోసం ముందుకు రావాలని, యువతే మార్పుకు చోదకశక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని యువతను ఏకం చేయడమే మహాజనసేన లక్ష్యమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమాన ప్రాతినిధ్యం, రాజ్యాధికారం సాధించే దిశగా పార్టీ తన కార్యాచరణను విస్తరిస్తుందని తెలిపారు.

## హఫీజ్‌పేట్‌లో మహిళపై దాడి..హోంగార్డు అరెస్ట్

**-వైరల్ వీడియోతో వెలుగులోకి వచ్చిన ఘటన..**

**-ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కాదని తేల్చిన రైల్వే అధికారులు**

**మియాపూర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త**
హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ మహిళపై పోలీస్ యూనిఫాంలో ఉన్న వ్యక్తి దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. మహిళతో వాగ్వాదానికి దిగిన సదరు వ్యక్తి ఆమెపై చేయి చేసుకోవడంతో పాటు జుట్టు పట్టుకుని కొంతదూరం ఈడ్చుకెళ్లిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. తొలుత దాడికి పాల్పడిన వ్యక్తి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్‌గా ప్రచారం జరిగినప్పటికీ, దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేపట్టిన విచారణలో అతను ఆర్‌పీ ఎఫ్ సిబ్బంది కాదని స్పష్టమైంది. వైరల్ అయిన వీడియోలో యూనిఫాంలో ఉన్న వ్యక్తి ఓ మహిళతో వాగ్వాదానికి దిగినట్లు, అనంతరం ఆమెపై దాడి చేసి జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకెళ్లినట్లు కనిపించింది. అక్కడ ఉన్న మరో వ్యక్తి అడ్డుకు నేందుకు ప్రయత్నించినప్పటికీ, సదరు వ్యక్తి మహిళను కొంత దూరం ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో ఘటనపై తీవ్ర స్థాయిలో స్పందన వ్యక్తమైంది. వీడియోపై విచారణ చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు దాడికి పాల్పడిన వ్యక్తి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు చెందిన హోంగార్డుగా గుర్తించారు. హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు అతను డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఘటన అనంతరం అతడిని తిరిగి తెలంగాణ పోలీస్ శాఖకు పంపించినట్లు, క్రమశిక్షణ చర్యల కోసం సంబంధిత శాఖకు అప్పగించినట్లు దక్షి ణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. ఈ ఘటనపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. రైల్వే పోలీస్ విభాగంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న హోంగార్డుపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. డీజీపీ ఆదేశాలతో మియాపూర్ పోలీసులు స్పందించి నిందితుడు ఆనంద్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీస్ శాఖ వేగంగా చర్యలు తీసుకోవడంతో కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

## మహిళల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ఘన విజయం



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న ఐసిటి కార్యదర్శి కె. దీప్లా

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :**
క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఐసిటి కార్యదర్శి కె. దీప్లా అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. నగరంలోని విజ్ఞాన్ జ్యోతి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో లీగ్ పద్ధతిలో రెండు రోజులపాటు మహిళల అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ పోటీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని సెయింట్ ఆన్స్ కళాశాల, భవన్ కళాశాల, సిబిఐటి, సెయింట్ జోసెఫ్ కళాశాలల క్రీడాకారిణిలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి సెమీ ఫైనల్‌లో సెయింట్ ఆన్స్ కళాశాల, సెయింట్ జోసెఫ్ కళాశాలపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోగా... రెండో సెమీ ఫైనల్‌లో భవన్స్ కళాశాల, సిబిఐటి పై విజయం సాధించి ఫైనల్‌లో అడుగు పెట్టింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీలో సెయింట్ ఆన్స్ డిగ్రీ మహిళా కళాశాల క్రీడా కారిణిలు భవన్స్ కళాశాల క్రీడాకారిణిలను చిత్తుగా ఓడించి మహిళల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెయింట్ ఆన్స్ డిగ్రీ మహిళ కళాశాల ఛాంపియన్‌గా నిలిచింది. భవాన్స్ కళాశాల రన్నరప్‌గా నిలవగా, మూడో స్థానం కోసం జరిగిన పోటీలో భవాన్స్ కళాశాల సీబీఐడీపై విజయం సాధించింది. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ అల్లం విజయరాణి మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీలను అభినందించారు.

### తానాజీనగర్‌లో భక్తిప్రపత్తులతో విశ్వకర్మ పూజ, యజ్ఞం



విశ్వకర్మ భగవానునికి పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** పాతబస్తీ ఉప్పుగూడ తానాజీనగర్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ పూజ, యజ్ఞ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ట్రస్ట్ భవనంలో జరిగిన పూజా కార్యక్రమంలో విశ్వకర్మ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అర్చక బృందం వేదమంత్రాల మధ్య యజ్ఞ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పలువురు జంటలు యజ్ఞ పూర్ణాహుతిలో పాల్గొని యజ్ఞద్రవ్యాలు సమర్పించారు. సమీప బస్తీలకు చెందిన విశ్వకర్ములు పెద్ద సంఖ్యలో హాజరై విశ్వకర్మ భగవానునికి పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులచే భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ జెల్లిపల్లి లక్ష్మీనారాయణచారి, అధ్యక్షులు సజ్జనపు షణ్ముఖాచారి, ప్రధాన కార్యదర్శి దాసోజు కనకాచారి, కోశాధికారి లక్కుంట్ల శ్రీనివాసచారి, సంఘం అధ్యక్షులు తోట శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి బోనాల మధుసూదన్‌చారి, కోశాధికారి మారోజు అశోక్‌చారి పాల్గొన్నారు.

## సర్కిల్ -2లో 37వేల స్మార్‌కార్డ్‌ల పంపిణీ

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** పౌర సరఫరాల శాఖ సర్కిల్-2 పరిధిలో గల లక్షా 37వేల స్మార్ట్‌కార్డుల స్థానంలో 37వేల స్మార్ట్‌కార్డుల పంపిణీ పూర్తి చేసినట్లు ఆ సర్కిల్ ఎఎస్ఒ ఎం.సురేందర్ తెలిపారు. మిగిలిన లక్ష స్మార్ట్ కార్డులను ఈనెల 30వ తేదీ వరకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత నెల 24వ తేదీ నుండి దాదాపు పది కేంద్రాల ద్వారా స్మార్ట్‌కార్డుల పంపిణీ ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఇంటి యజమాని రేషన్ కార్డు ఆన్‌లైన్ పత్రం, ఆదార్‌కార్డు, మొబైల్ నెంబర్ విధిగా తీసుకు రావాలన్నారు. స్మార్ట్‌కార్డులు పంపిణీ జరుగుతున్న ప్రాంతాలు... మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో.. 219, 222, 223, 231, 233, 243, 256, రాజనర్సింకాలనీ ఎ.ఆర్.గార్డెన్‌లో..269, 270, 283, 300, 304, ఈదీబజార్ వార్డు కార్యాలయంలో..271, 301, 303, ఉప్పుగూడ సరస్వతి శిశు మందిరంలో...234, 245, 272, 273, 285, నూర్‌ఖాన్ బజార్ ఫర్హత్ కమ్యూనిటీ హాలులో..202, 204, 205, 206, 207, 211, 212, 227, బార్కాస్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో.. 279, 280, 282, 306, గౌలిపురా మిత్రాక్లబ్‌లో..261, 267, 268, 295, 298, తలాబ్‌కట్టా ఎఫ్‌పి దుకాణంలో... 262, 289, 294, 296, 299, జంగమ్మెట్ వార్డు కార్యాలయంలో.. 248, 250, 251, 277, 292. గౌలిపురా కమ్యూనిటీ హాలులో.. 261, 295, 298 దుకాణాలకు సంబంధించిన రేషన్‌కార్డుదారులకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇక స్థానిక పరిస్థితుల కారణంగా చాంద్రాయణగుట్టలోని 276 దుకాణానికి సంబంధించి అక్టోబర్ ఒకటిన స్థానిక గ్రంథా లయంలో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వినియో గదారులు సూచించిన కేంద్రాలకు వెళ్ళి స్మార్ట్‌కార్డ్ పొందాలని ఎఎస్ఒ కోరారు.

## టిమ్స్ ఆసుపత్రిలో తాళం పగులగొట్టి ఐఓ పరికరాలు అపహరణ

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఎర్రగడ్డలోని టిమ్స్ ఆసుపత్రిలో చోరీ జరిగింది. బోరబండ పోలీసు కథనం ప్రకారం... కిమ్స్ హాస్పిటల్ లోని మెటీరియల్ నిల్వ గది తాళం పగులగొట్టి రూ.35 వేల విలువైన 12 బాక్సుల ఐఓ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. టిమ్స్ ఆసుపత్రిలో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న న.నాగ సాయివంశీ కృష్ణకు ఐదో అంతస్తులోని అకడమిక్ బ్లాక్‌లో మెటీరియల్ నిల్వ చేసుకునేందుకు ఓ గదిని కేటాయించారు. ఉదయ్ నెట్‌వర్కింగ్ టెక్నాలజీస్‌కు చెందిన పరికరాలను ఆ గదిలో భద్రపరిచి, తాళం వేశారు. గది తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి లోపల పరిశీలించగా ఒక్కో బాక్సులో 24 ఐఓలు చొప్పున ఉన్న 12 బాక్సులు కనిపించలేదు. వాటి విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించి, అనంతరం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీటి దుర్వినియోగం.. వినియోగదారుడికి రూ.20 వేల జరిమానా

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 23లో ఓ వినియోగదారు తాగునీటిని ఫ్లోర్ క్లీనింగ్‌కు ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు రూ.20 వేల జరిమానా విధించి వసూలు చేశారు. తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతాయుతంగా వినియోగించాలని జలమండలి ప్రజలకు సూచించింది. నిబంధనలు ఉల్లంఘించి తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

## ఘనంగా శ్రీనారాయణీ ప్రత్యంగీరా హోమం



ప్రత్యంగీరా హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**కీసర, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల సాయినగర్ కాలనీలో అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించిన శ్రీ నారాయణీ ప్రత్యంగీరా మహదేవి హోమంలో మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేకపూజలుచేశారు. గణేష్‌నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కీసర క్షత్రియ యూత్, సునీల్‌వర్మ సంయుక్త ఆద్వర్యంలో శనివారం ఆధ్యాత్మిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్బంగా శ్రీసద్గురు శాంకరిఅఘోరిమాతాజీ పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్రోక్తంగా హోమ క్రతువు సాగింది. సకల గ్రహదోషాలు, శత్రుపీడ నివారణతో పాటు లోక కళ్యాణం, ప్రజలందరి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కాంక్షిస్తూ ఎందు మిరపకాయలతో ఈ విశేష ప్రత్యగీరా హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కందాడి శ్రీకాంత్‌రెడ్డి, ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జయరాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.హోమ మహోత్సవం అనంతరం నిర్వాహకులు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పచ్చటి మొక్కలతోనే భవిష్యత్ తరాలకు భరోసా

**-వెల్‌జర్ల సర్పంచ్ ఆర్.బాబునాయక్**



వనమహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఫరూఖ్‌నగర్ మండల పరిదిలోని వెల్‌జర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆర్.బాబునాయక్ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పచ్చటి మొక్కలే భవిష్యత్ తరాలకు భరోసానిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాలని, మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటిసంరక్షణకు కూడా కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం వన మహోత్సవ కార్యక్రమాన్ని యజ్ఞంలా నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి బాల మల్లేష్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, గ్రామ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి

**-మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కాలం సరిగా లేక అన్ని వర్గాల రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా రైతులు తమ పంటలను నష్టపోయారని, ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యేడు సరైన సమయంలో వర్షాలు పడక, పంటలకు సరిపడా నీళ్లు లేక ఇప్పటికీ సుమారు 80 మేరా పంటలు ఎండిపోతున్నాయని, భూగర్బ జలాలు మరింత అడుగంటుతే వరి పంట కూడా పండే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలినో పరిస్థితి నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా నిలవవలసిన అవసరం ఉందని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పంటల సాగుపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంటల నష్టం పై అంచనావేసి రైతులకు తగిన ఆర్థికభరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పంటబీమా తక్షణ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాలలో మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోయిందని, వర్షంపై ఆధారపడి పంటలు స్థాయిలో సాగు కాలేదని చెప్పారు. రానున్న యాసంగి పంటలకైనా విత్తనాలు, ఎరువులు పెద్ద మొత్తంలో రైతులకు అందించాలని కోరారు. ఎలినో ప్రభావం ఎదుర్కొనేవిధంగా రైతులకు సలహాలు సూచనలు చేసి వాతావరణానికి అనుకూలంగా పంటలువేసేవిధంగా ప్రోత్సహించాలని కోరారు. ప్రతి పంటకు మద్దతు ధర వచ్చే విధంగా, సకాలంలో పంటకు తగిన డబ్బులు అదే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలని సూచించారు. రైతు బంధు నిధులను సైతం సకాలంలో విడుదల చేసి రైతుకు అండగా ఉండాలని ఆకాంక్షి ంచారు.

## విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

**కీసర, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి కేంద్ర ప్రభుత్వ పథకాలలో భాగంగా చీర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్దులకు నూతన ఆవిష్కరణలు, పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన మెలకువలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎంఆర్ టెక్నికల్‌క్యాంపస్‌న ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్దులకు ఆవిష్కరణ ప్రాధాన్యత, సృజనాత్మక ఆలోచనలు, పరిశ్రమల స్దాపనకు అవసరమైన మౌళిక అంశాలపై అవగాహన కల్పించారు. నిర్వాహకులు కిరణ్ విద్యార్దులకు పటు అంశాలను వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, పూర్వ విద్యార్ది బోడ శ్రీనివాస్‌రావుపాల్గొని విద్యార్దులకు పలుసూచనలు,సలహాలు అందించారు. విద్యార్దుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడుతాయని తెలిపారు.

## విద్యతోనే జీవితానికి బలమైన పునాది

**-దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ భాస్కర్**

**కేశంపేట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:**
విద్య ద్వారానే విద్యార్థుల జీవితానికి బలమైన పునాది ఏర్పడుతుందని దత్తాయపల్లి గ్రామసర్పంచ్ భాస్కర్ అన్నారు. కేశంపేటమండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ భాస్కర్ శనివారం యూనిఫామ్‌లు, షూలను అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలికసదుపాయాలు అందుతున్నాయని తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ భాస్కర్ పేర్కొన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, షూలు అందించడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు శివ, ఏపీసీ చైర్మన్ అరుణ, గ్రామ వార్డు సభ్యులు యాదయ్య, రవి, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 25వార్డు లో శివ భారత్ యూత్ గణేష్ మండల్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, అనంతరం కాలనీ వాసులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వంలతో ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కార్యక్రమంలో కౌన్సిలర్ మురళీ మోహన్ అప్పి, మాజీ కౌన్సిలర్ చేగురి రాజేందర్‌రెడ్డి, సర్వర్ పాషా, కట్ట వెంకటేష్‌గౌడ్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కా చెరువును సందర్శించిన మున్సిపల్ చైర్మన్, జీనోమ్‌వ్యాలీ సిఐ



మల్కాచెరువును ఏర్పాట్ల కోసం సందర్శించిన మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, సిఐ గురువయ్యగౌడ్, కౌన్సిలర్‌ల దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
వినాయకుల నిమజ్జనం కోసం లాల్‌గడిమలక్‌పేట్ మల్కాచెరువును అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జీనోమ్‌వ్యాలీ పోలీస్ సిఐ గురువయ్యగౌడ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొని పరిశీలించారు. శనివారం శామీర్‌పేటమండలం అలియాబాద్ మున్సిపల్‌పరిధిలోని లాల్ గడిమలక్‌పేట్ మల్కాచెరువును వారు సందర్శించి వినాయకుల నిమజ్జనం కోసం వారు ఏర్పాట్లు పరిశీలించారు. దీనికి ముందుగా ప్రజయ్‌హోమ్స్ (వాటర్ ఫ్రంట్)లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి వినాయకున్ని చైర్మన్ శిరీషకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఆమెతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా మల్కా చెరువును సందర్శించి పరిశీలించిన వారిలో మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జీనోమ్‌వ్యాలీ సిఐ గురువయ్యగౌడ్, కౌన్సిలర్లు యూసుప్‌బాబ, హనుమాన్‌దాస్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యమే మా ప్రాధాన్యం..

**-మోడ్రన్ మరుగుదొడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ మున్సిపాలిటీ 25వ వార్డు పరిధిలోని కుంటబండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక మరుగుదొడ్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. రాయికల్ టోల్‌ప్లాజా వారి ఆర్థికసహకారంతో ఈ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడితే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్‌చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాల అవసరాలను పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్‌ముదిరాజ్, కౌన్సిలర్లు పెంటయ్య, రాజునాయక్, మండల విద్యాధికారి మనోహర్, ముబారక్‌అలీఖాన్, చందునాయక్, రవితేజ, శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత డెర్మటాలజీ క్యాంప్ నిర్వహణ

**-300 మందికి పైగా వైద్య పరీక్షలు**




వైద్యులకు సన్మానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

**కొడంగల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
లయన్స్ క్లబ్ ఆఫ్ కొడంగల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఉచిత చర్మవ్యాధి (డెర్మటాలజీ) నివారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ క్యాంప్‌నకు విశేష స్పందన లభించగా,300 మందికి పైగా ప్రజలు హాజరై తమ చర్మ సంబంధిత సమస్యలకు వైద్యుల నుంచి పరీక్షలు,సలహాలు పొందారు.ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు,కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్(ఎండి-డెర్మాటాలజీ) పురుషులకు,మహావీర్ మెడికల్ కాలేజ్ (వికారాబాద్) ప్రొఫెసర్ డాక్టర్ సంతోషి అరవింద్(ఎండి-డెర్మాటాలజీ) మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్యుల సూచన మేరకు అవసరమైన రోగులకు ఉచితంగా మందులు,క్రీములు,టాబ్లెట్లను అందజేశారు.ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో ఉపగయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ రవీంద్ర యాదవ్,కార్యదర్శి డాక్టర్ లయన్ సాకేత్,జాయింట్ సెక్రెటరీ లయన్ భీమరాజు,కానుకుర్తి రమేష్,శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొని క్యాంప్ విజయవంతానికి సహకరించారు.భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్లబ్ ప్రతినిధులు వెల్లడించారు.

## విద్యార్దులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**కీసర, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
విద్యార్దులు అవసరాలకు అనుగుణంగా తమనైపుణ్యాలను పెంపొందించుకోవాలని హిట్స్‌కళాశాల చైర్మన్ ఆరిమండ సిద్దార్ధరెడ్డి సూచించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని బోగారం గ్రామంలోని హోలీమేరీ క్యాంపస్‌లో నాస్‌కమ్ సహకారంతో నిర్వహించిన వర్క్‌షాప్ ఆన్ జెన్‌ఏఐ అండ్ జెన్‌ఏఐ టూల్స్ విద్యార్దులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా చైర్మన్ సిద్దార్ధరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. టర్నిన్ ఇన్నోవేషన్ టెక్నాలజీస్ డైరెక్టర్ శ్రీకాంత్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని సుమారు 30 ఏళ్ల సాంకేతిక అనుభవం కలిగిన ఆయన ఏఐటూల్స్ ప్రాధాన్యత, ప్రయోజనాలు, భవిష్యత్ అవకాశాలను వివరించారు. వర్క్‌షాప్‌లో విద్యార్దులకు పలు చిన్న ప్రాజెక్టులు అప్పగించి, వాటిని స్వయంగా పరిష్కరించేలా నిపుణులు మార్గనిర్దేశం చేశారు. ఏఐ సాంకేతికతను ఆచరణలో ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. సమస్య పరిష్కార సామర్ధ్యం, సృజనాత్మక ఆలోచన, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఐటిసిఎల్ ప్రెసిడెంట్ ఆరిమండ వరప్రసాద్‌రెడ్డి, కో ఆర్డినేటర్ ప్రత్యూష్ కుమార్ పట్నాయక్, హెచ్‌ఐటీఎస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, శాఖాధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీ,ఆధ్యపకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

**-జవహర్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం**

**జవహర్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలు,మాజీ మేయర్ శాంతికోటేష్‌గౌడ్ అన్నారు. శనివారం జవహర్‌నగర్‌లోని బీజేఆర్‌నగర్ మామిడితోటలో స్మైల్‌ఫౌండేషన్ సహకారంతో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ పేద,మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని,వ్యాధి తీవ్రత పెరగకముందే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ముఖ్యంగా వృద్ధులు,మహిళలు,చిన్నారులు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిబిరంలో సాధారణ వైద్యం,ఎముకలు-కీళ్ల సమస్యలు,చిన్నారుల ఆరోగ్య సమస్యలకు సంబధించి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి సూచనలు అందించారు.ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే తన లక్ష్యమని శాంతి కోటేష్ గౌడ్ తెలిపారు.

కార్యక్రమంలో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కొలిపాక సాయికిరణ్, కొలిపాక కళ్యాణి, స్మైలఫౌండేషన్ సీహెచ్ఓ ఎండీ సాదిక్, వైద్యులు గడ్డం రాజకుమార్, జె.గౌతమీ, మెద శిరీష, సిబ్బంది సంధ్యారాణి, సిమియా, మానస రాజశేఖర్, పవిత్ర, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, మాట్ల వినయ్,మాట్ల క్రాంతికుమార్, నాయకం భాస్కర్ మంద ఆనంద్,సోమేశ్,మాయ కోటి,చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజోత్సవం

**-మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనసన్మానం**



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చైర్మన్ పత్యానాయక్

**ఆమనగల్లు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గురువులేని విద్య, మార్గదర్శిలేని సమాజం ముందుకు సాగలేదని, ఉపాధ్యాయులు సమాజానికి నిజమైన మార్గదర్శకులని ఆమనగల్లు పురపాలక సంఘ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని మానసగార్డేన్స్‌లో శనివారం ఆమనగల్లు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ పగిడిపాల పాండు సారథ్యంలో గురుపూజోత్సవం నిర్వహించి ప్రభుత్వ ఉధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.150 మంది ఉపాధ్యాయుల సేవలను పరిగణలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి శాలువాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ పాల్గొని ఉపాధ్యాయ వృత్తిపై, ఉత్తమ ఉపాధ్యాయుల సేవలపై ప్రశంసలు కురిపించారు. సమాజాభివృద్ధికి కావలసిన ఏవృత్తినైన తయారుచేసే ఏకైకరంగం విద్యననే కొనియాడారు. విద్యతోనే డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ వంటి వృత్తులు ఏర్పడుతాయన్నారు. దానివెనుక ఉపాధ్యాయుని కృషి ఎనలేనిదని పొగిడారు. ఉపాధ్యాయవృత్తి అత్యంత పవిత్రమైనదన్నారు. విద్యతోనే ఏదైన సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అజయ్ జయరాం, మున్సిపల్ కమీషనర్ రాఘవేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు పాపిశెట్టి రాము, నాగిళ్ళ జగన్, పిండి అనూషశ్రీశైలంతోపాటు శ్రీనివాస్‌యాదవ్, రమేష్, చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు పద్మ, చందులాల్, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది సాయికుమార్, కిషన్, అహ్మద్, శైలజ పాల్గొన్నారు.

## వసతుల్లేని గ్రామసభ ప్రజల ఆగ్రహం

**బషీరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గ్రామ ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన గ్రామసభలో కనీస వసతులు లేకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన బషీరాబాద్ మండలపరిధిలోని మైల్వార్‌గ్రామంలో చోటుచేసుకుంది. సర్పంచ్ సీమసుల్తానా అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన యన్‌ఆర్‌ఈజియస్ పనులపై గ్రామసభ నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. అయితే సభకు హాజరైన ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేదని పలువురు ఆరోపించారు.కూర్చునేందుకు కుర్చీలు,ఎండ నుంచి రక్షణకు టెంట్ లేకపోవటం, తాగేందుకు నీరు కూడా లేదని కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై పంచాయతీ కార్యదర్శి అశోక్,సర్పంచ్‌పై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే గ్రామసభలో పారిశుధ్య కార్మికులు తమవేతనాల సమస్యను ప్రస్తావించారు. నెలలు గడుస్తున్నా వేతనాలు అందడం లేదన్నారు.జీతాల చెల్లింపుల కోసం అడుగుతున్నా పంచాయతీ కార్యదర్శి కాలయాపన చేస్తున్నారని వారు ఆరోపించారు.వేతనాలు సకాలంలో అందకపోతే వారి కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గ్రామసభ నిర్వహణలో కనీసవసతులు కల్పించకపోవడం, పారిశుధ్య కార్మికుల వేతనాలపై వచ్చిన ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణచేపట్టాలని గ్రామస్థులు పేర్కొన్నారు.గ్రామసభ అంటే కేవలం హాజరు పట్టికలు,తీర్మానాలకే పరిమితం కాకుండా. ప్రజల సమస్యలను వినే విధంగా ఉండాలని వారు తెలిపారు.

**సర్పంచ్ వివరణ...**
సాధారణ గ్రామసభ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే చేస్తామని సర్పంచ్ సీమసుల్తానా తెలిపారు. తాజాగా నిర్వహించిన యన్‌ఆర్ ఈజియస్ కింద గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నమోదు చేయడం కోసమే అత్యవసరంగా ఏర్పాటు చేసిన సమావేశమని ఆమె స్పష్టం చేశారు.ఈ సమావేశాన్ని సాధారణ గ్రామసభగా భావించాల్సిన అవసరం లేదన్నారు.చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసి రాద్ధాంతం చేయడం సరికాదని గ్రామ ప్రజలు, వార్డుసభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని సర్పంచ్ సీమసుల్తానా కోరారు.

## టిజెఎస్ జిల్లా కార్యవర్గానికి నియామకపత్రాల అందజేత




నియామకపత్రాలు అందజేస్తున్న టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
తెలంగాణ జన సమితి మేడ్చల్ జిల్లా కార్యవర్గానికి శనివారం ఆపార్టీ అధ్యక్షులు-ఎమ్మెల్సీ కోదండరామ్ నియామకపత్రాలను అందజేశారు. పార్టీ జిల్లా కార్యవర్గాన్ని ఆయన ఇటీవల ఎంపిక చేశారు. ఈమేరకు నూతన కార్యవర్గానికి ఆయన నియామకపత్రాలు అందజేయగా వారు పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా అధ్యక్షునిగా ఘట్‌కేసర్‌కు చెందిన మారం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా రెడ్డిపల్లి శ్రీనివాస్, తిరుమల్‌రెడ్డి, బర్మోజు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల దయాకర్, కోశాధికారిగా సుమంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జంగం రవికుమార్, లింగోల దయాకర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా గాండ్ల లక్ష్మణ్, పొలమోని బాలశివశంకర్‌లకు కోదండరామ్ నియామకపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా జిల్లాఇంచార్జ్ పల్లె వినయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అశోక్‌రెడ్డి, భద్రకామి ఆంజనేయులు, రాష్ట్ర యువజన విభాగం నాయకులు ఎర్ర వీరన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కోతూర్ ఎస్‌బిఐలో రూ.20 లక్షల బీమా క్లెయిమ్ సెటిల్‌మెంట్

**-రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీకాంత్ కుటుంబానికి ఆర్థిక భరోసా..**

**కోతూర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్‌బీఐ ఖాతాదారుడు దివంగత శ్రీకాంత్ కుటుంబానికి వ్యక్తిగత ప్రమాద బీమా పథకం ద్వారా రూ.20 లక్షల ఆర్థిక భరోసా లభించింది. కోతూర్ ఎస్‌బీఐ శాఖ (21180), వికారాబాద్ రీజియన్ పరిధిలో పై ప్లస్‌పథకం కింద రూ.20లక్షల క్లెయిమ్‌ను శనివారం విజయవంతంగా సెటిల్‌మెంట్‌చేశారు. శ్రీకాంత్ రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో, ఆయన నామినీ కల్పనకు రూ.20,00,000 బీమా మొత్తాన్ని అందజేశారు. క్లెయిమ్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన చెక్కును రీజినల్ మేనేజర్ డి. మోహన్ నాయక్, కోతూర్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ నామినీ కల్పనకు అందజేశారు.ఈసందర్భంగా క్లెయిమ్‌ను సకాలంలో పరిష్కరించడంలో చొరవచూపిన ఎస్‌బీఐ కోతూర్ శాఖ సిబ్బందిని అభినందించారు. ఖాతాదారులకు బీమా రక్షణపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించడంలో బీమా పథకాల ప్రాధాన్యతను ఈ క్లెయిమ్ సెటిల్‌మెంట్ చాటిచెప్పింది. అలాగే క్రాస్‌సెల్ వ్యాపారానికి సహకరిస్తూ, బృందానికి మార్గనిర్దేశం చేస్తున్న డీజీఎం మదన్ ఎస్.కు ఎస్‌బీఐ జనరల్ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## ప్రజలకు మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : శ్రీగణేష్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 45 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీము బారక్ చెక్కులను తిరుమలగిరి తహశీల్ధార్ బిక్షపతితో కలిసి లబ్ధిదారు లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్ చెక్కులను 3,4 నెలల వ్యవధిలోనే అందజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి మంచిపేరు రావద్దనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి పథకం అమలు కాకుండా కోర్టులో కేసు వేసి స్టే తెచ్చిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడికి పూజలు నిర్వహించిన చంద్రప్రియ అనీల్

**మోమిన్ పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మోమిన్‌పేట మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్, ఏ. చంద్రప్రియ అనిల్ దంపతులు, కుటుంబ సమేతంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆమెకు గ్రామస్తులు, భక్తులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం వినాయకుడికి పుష్పాలు సమర్పించి, అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలునిర్వహించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్, ఏ. చంద్రప్రియ అనిల్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పండుగలను అందరూ కలిసి మెలిసి సామూహికంగా జరుపుకోవాలని, యువత, మహిళలు, గ్రామ పెద్దలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, మన చంద్ర ఫౌండేషన్ సభ్యులు, యువత వినాయకుడి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.

## ప్రముఖ వ్యాపారవేత్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మల్లి పెద్ది శ్రీనివాస్ గుప్తా జన్మదిన సందర్భంగా శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, కట్ట వెంకటేష్‌గౌడ్, బాలరాజుగౌడ్ పెంటయ్య, మురళీమోహన్, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, రాజేందర్‌రెడ్డి, సర్వర్ పాషా, వెంకటేష్‌గుప్తా, జంగారి రవి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## సమాజంలో సోదరభావం పెంపొందించాలి..

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్, పద్మావతి కాలనీ, శ్రీనివాస కాలనీ, ఫరూఖ్‌నగర్, ఆనంద్ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా మండపాల్లో కొలువుదీరిన శ్రీ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాలు భక్తిభావం, ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్న ఆయన.. ఉత్సవ నిర్వాహకులను అభినందించారు. అనంతరం వివిధ మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజలందరిలో ఆధ్యాత్మిక భావనతో పాటు పరస్పర ఐక్యతను పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, నడికూడ అనిత, పిన్నమోని గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, కానుగు అంతయ్య, నందకిషోర్, జూపల్లి శంకర్, ఆలుగడ్డ పుష్పమ్మ ప్రవీణ్, చిన్న యాదగిరి, నడికూడ యాదగిరి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివరాజ్ యాదవ్, రఘుమారెడ్డి, నాయకులు నక్కల వెంకటేష్, రవి యాదవ్, మల్చలం భిక్షపతి, బాలకృష్ణ, ప్రేమ్ కుమార్ గౌడ్, నక్కల విజయ్, హరిబాబు, లింగం యాదవ్, అందె మహేశ్వర్, నడికూడ అశోక్, శ్రీనివాస్, రవి, వినయ్, మిథున్, రవితేజ, అంచ రాజు, విష్ణువర్ధన్, అశోక్, శ్రీధర్ చారి, నవీన్, సుమదీర్ బబ్లూ, ప్రవీణ్, రాఘవేందర్ గౌడ్, మంగ శ్రీశైలం, చెర్క శివ, కొండ మల్లేష్, నరేష్, పద్మ వెంకటేష్ తదితరులు, కాలనీ వాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని పరామర్శించిన చామల రఘుపతిరెడ్డి

**కోట్‌పల్లి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త;**
వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మల్‌చేట్‌పల్లితాండకు చెందిన మాజీ కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్‌నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చామల రఘుపతిరెడ్డి శనివారం నాడు ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించారు. ఈసందర్భంగా నర్సింగ్‌నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చామల రఘుపతిరెడ్డి అయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. నర్సింగ్‌నాయక్ త్వరగా కోలుకోవాలని అయన ఆకాంక్షించారు. అనారోగ్య సమయంలో పార్టీ నాయకులు అండగా ఉంటారని అయన భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తేనె రాంచెంద్రారెడ్డి, కంకణాలపల్లి సర్పంచు రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యతోనే ఎందరో ఉన్నత స్థాయికి చేరారు

**రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి, ఎందరో నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ గుర్తు చేశారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్‌లో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఫూల్‌బాగ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివుతున్నామని, పేదలమని ఎవరూ భావించవద్దని, ప్రభుత్వ పాఠశాలలో సైతం నేడు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం భీమా మైదాన్ అంగన్‌వాడి కేంద్రంలో అంగన్ వాడి టీచర్లను, ఆయాలను సత్కరించి, వారు చేస్తున్న సేవలను కొనియాడారు. చిన్నారుల సంక్షేమం, సంరక్షణ మరియు విద్య కోసం అంకితభావం తో సేవలందిస్తున్న అంగన్‌వాడి సిబ్బంది సేవలు అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ కార్పోరేటర్ రవిచారి, ముషీరాబాద్ బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతిని కలిసిన డాక్టర్.కిఫాయత్ ఎండి

**చార్మినార్,సెప్టెంబరు 19 ప్రభాతవార్త :**
భారత దేశ రాష్ట్రపతి ద్రౌపది ము ర్మును న్యూఢిల్లీలో పాతనగరానికి చెందిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నూతన జాతీయ అధ్యక్షుడు డాక్టర్.కిఫాయత్ ఎండి మర్యాద పూర్వకంగా కలిశారు. ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమిషన్ నూతన జాతీయ అధ్యక్షు డిగా డాక్టర్.కిఫాయత్ ఎండి నియమితులయ్యారు.ఈ సందర్బంగా డాక్టర్.కిఫాయత్ ఎండి మాట్లా డుతూ సమాజంలో ప్రతీ ఒక్కరికి సమానమైన న్యాయం,గౌరవం ద క్కేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

## పూర్వీకులందించిన సత్య ఆధారిత విజ్ఞానం జ్యోతిష సంఖ్యాశాస్త్రాలు

**-ఏపి హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణరావు**

**రవీంద్రభారతి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** అనాదికా లంగా భారతీయ సంస్కృతి విజ్ఞానంలో భూమికలైన జ్యోతిషం, సంఖ్యాశాస్త్రాలు మూఢనమ్మకాలు కావని, అవి మన పూర్వీకులు అందించిన సత్య ఆధారిత గొప్ప విజ్ఞాన సర్వసాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా. యడవల్లి లక్ష్మణరావు తెలిపారు. సంఖ్యా శాస్త్రంలో ప్రతీ సంఖ్యకు ప్రత్యేకస్థానం ఉంటుందని, వ్యక్తిత్వాన్ని, స్వభావం, ఆలోచనా విధానాలను సూచి స్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ సాంస్కృతిక కళపత్రిక, జయహోపబ్లికేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత, కవి, సినీ నాటక నటుడు-దర్శకుడు తనికె ళ్ళభరణి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు విశిష్ట అతిథులు సారిపల్లి కొండలరావు, తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ టి.రజనీకాంత్‌రెడ్డి, మహ్మద్ ఖదీర్‌బాబు, కళపత్రిక సంపాదకుడు డా. మహ్మద్‌రఫీ, జనార్ధన్ మహర్షి, కె.సాంబమూర్తి, నాళం సుజాత, పట్నాయకుని శంకర్‌ప్రసాద్ తదితరులతో యు ఆర్ ది న్యూమరాలజిస్ట్ (కంప్లీట్ గైడ్ టు న్యూమరాలజీ) పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత డా.మహమ్మద్ దావూద్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు.

## వినాయక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**కీసర, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కీసర సర్కిల్ పరిధిలోని అహ్మద్‌గూడ గ్రామంలో రాయల్స్ యూత్ ఆధ్వర్యంలో వెలసిన వినాయక మండపాల్లో శనివారం మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యూత్ యువకులు 50మంది రక్తదానంచేశారు. రక్తదానంచేసిన యువకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకమండపాల్లో ప్రత్యేకపూజలు చేసిన మాజీచైర్మన్

**కీసర, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
నాగారం డివిజన్ 5వపరిధిలోని సత్యనారాయణకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, ఈస్ట్ గాంధీనగర్ కాలనీలలోని వినాయకమండపాల్లో పూజాకార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు రంగారెడ్డి, సత్యంసాగర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్, వీరేష్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, నిమ్మల శ్రీను, అన్నంరాజు శ్రీనివాస్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి: సర్పంచ్



టాస్‌వేసి కబడ్డీని ప్రారంభిస్తున్న సర్పంచ్ నీరటి లక్ష్మీ

**ధారూర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ధారూర్ మండల పరిధిలోని నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్‌ఎస్) ప్రాంగణంలో జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్దేముల్, కోట్‌పల్లి, ధారూర్ మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడాప్రతిభను ప్రదర్శించారు. నాగారం గ్రామ సర్పంచ్ నీరటి లక్ష్మీ ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములతో సంబంధంలేకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెడ్‌మాస్టర్) వెంకటరమణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగారం గ్రామపెద్దలు సి.వీరేందర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయబృందం, గ్రామపెద్దలు, భారీసంఖ్యలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

## ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పోతుగల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**షాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని పోతుగల్ సర్పంచ్ పామెన నర్సింహులు అన్నారు. శనివారం మండల పరిధిలోని పోతుగల్లో వెల్స్పన్ వారి సౌజన్యంతో ఉచిత మెబైల్ వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బారిన పడకుండా ఒక లక్ష్మాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వెల్స్పన్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, ఉపసర్పంచ్ సావిత్రి, వార్డు సభ్యులు చంద్రశేఖర్, గ్రామస్తులు యాదయ్య, రాజుగౌడ్, లక్ష్మయ్యగౌడ్, మహేందర్, నరేష్, పెంటయ్య, మల్లేష్, వైద్యులు పాల్గొన్నారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

**-ఎంపిఓ రతన్‌సింగ్**



వివరాలను తెలుసుకుంటున్న ఎంపిఓ

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పంచాయతీ కార్యదర్శులు విధులలో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని ఎంపిఓ రతన్‌సింగ్ హెచ్చరించారు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఎంపిఓ శనివారం విచారణ చేపట్టారు. 2023-24, 2026-27లో మాజీ పంచాయతీ కార్యదర్శి రాజు ఆయన భార్య పేరున చెల్లింపులు చేసినారని, అధేవిధంగా ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి అయిన పరమేశ్వర్ కూడా మాజీ పంచాయతీ కార్యదర్శి భార్య పేరున చెల్లింపులు చేశారని, వారిపై చర్యలుతీసుకోవాలని బి.నవీన్‌కుమార్ ఫిర్యాదుచేసారు. ఈమేరకు ఎంపిఓ రతన్‌సింగ్ గొట్లపల్లిగ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపిఓ రతన్‌సింగ్ మాట్లాడుతూ విచారణ అనంతరం తదుపరి చర్య నిమిత్తం పై అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో సర్పంచ్ సలామ్ ఉపసర్పంచ్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు



జాంబ యూత్ ఆధ్వర్యంలో మహిళల బతుకమ్మ ఆట దృశ్యం

**నందిగామ, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామ మండల కేంద్రంలోని అంబేద్కర్‌కాలనీలో జాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం రాత్రి మహిళలు ఆటపాటలతో అదరగొట్టారు. జాంబ ఆధ్వర్యంలో నిర్మించిన మండపం వద్ద సౌండ్ సిస్టం కోసం కాంగ్రెస్ యువనేత, వార్డుసభ్యుడు శివగళ్ళ ప్రవీణ్ రూ.12వేలు బహూకరించారు. కనీవినీ ఎరుగనిరీతిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ముందు నెలకొల్పిన గణేషుడి విగ్రహం చిన్న, పెద్ద వయోపరిమితి లేకుండా ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆటపాటలతో ఆనందించడం నందిగామ చరిత్రలో మొదటిసారిగా రికార్డు సృష్టించింది.

# 24 గంటలు విద్యుత్ అందించాలి

**-సిపిఎం నాయకులు**




విద్యుత్ కార్యాలయం ముందు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**యాచారం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
తెలంగాణ రైతు సంఘం యాచారం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం రైతులకు 24గంటల కరెంటు సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంలో సాగర్ రహదారిపైన ర్యాలీచేపట్టి అనంతరం విద్యుత్ ఏఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం యాచారం మండలం అధ్యక్షులు మండల బాలరాజ్, మండల ప్రధానకార్యదర్శి తావునాయక్ మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో వర్షాలు కురవక వేసినపంటలు పత్తి, జొన్న ఒకపక్క పూర్తిగా ఎండిపోవడం వలన రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్ళని పరిస్థితి. కాబట్టి ఎంతో కొంత రైతులు వరిపంట వేసుకోవడం జరిగింది కాని, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో రైతాంగానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వడం జరిగినా, అమల్లో మాత్రం లేని పరిస్థితి ఉంది. క్రమక్రమంగా కరెంటు ఎనిమిది గంటలకు ఇవ్వడం వల్ల ఉన్న కొద్దిపాటి వరిపంట కూడా ఎండిపోతుంది. కాబట్టి తక్షణమే ఏఈ జోక్యం చేసుకొని ఈ ప్రాంతాల్లో ఉన్న రైతులకు 24గంటల కరెంటుసౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా అర్హులైన ప్రతి రైతుకు కరెంటుసౌకర్యం కల్పించాలని, కరువులో ఉన్న రైతులని ఆదుకోవాలని, రైతులకి ప్రత్యేకంగా కరెంటుసౌకర్యం ఉండేవిధంగా చూడాలని అన్నారు. గ్రామంలో ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే ఎల్సీ తీసుకోవడం వల్ల రైతులు కరెంటు పోవడం ద్వారా పంటలకు సాగునీరు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. రైతులకి ప్రత్యేకమైన లైన్ ద్వారా కరెంట్‌సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండలపరిధిలో ఉన్న అన్ని గ్రామాలరైతులనుకలుపుకొని పెద్దఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ రెండు నెలలు రైతులకు 24గంటల నాణ్యమైన కరెంటుసౌకర్యం కల్పించాలని ఏఈని కోరడం జరిగింది. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఆలంపల్లి నరసింహ, పి.అంజయ్య, అలంపల్లి జంగయ్య, సభావత్ చందునాయక్, రైతుసంఘం జిల్లాకమిటీ నాయకులు ఎం.ఐలయ్య, మండల ఉపాధ్యక్షులు బి.శ్రీశైలం, సహాయ కార్యదర్శి ఎస్సార్ ఆంజనేయులు, భాషయ్య, బుగ్గ రాములు, గడ్డం యాదగిరి, రామ్‌రెడ్డి, సత్యనారాయణ, జగన్, కుమార్, మల్లేష్, జంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లులో భారీ వర్షం



అలుగు పారుతున్న మేడిగడ్డతండా కత్వావాగు

**ఆమనగల్లు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
ఆమనగల్లు మండలంలోని పలుగ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ప్రారంభమైన వాన గంటకు పైగా ఎడతెరిపిలేకుండా కురిసింది. వరుసగా రెండురోజుల పాటు కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరింది. మండలపరిధిలోని మేడిగడ్డ గ్రామ పంచాయతీ కత్వావాగు భారీవర్షానికి అలుగు పారింది. వర్షాభావ పరిస్థితులతో ఆందోళన చెందుతున్న ప్రజలకు ఈవర్షం ఊపిరిపోసింది. దీంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు. రెండురోజుల క్రితం నీరులేక వెలవెలబోయిన కత్వావాగు ఊహించని విధంగా అలుగు పారడంతో ఆగ్రామ సర్పంచు రాజేశ్వరిమల్లేశ్, ఉపసర్పంచు విజయ్‌రాథోడ్ హర్షం వ్యక్తంచేశారు. అలాగే మండల కేంద్రంలో రెండురోజుల పాటు భారీవర్షం కురిసింది. ఎల్‌నినో ఎఫెక్ట్ మూలంగా ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనాలకు భారీవర్షాలు కాస్త ఉపశమనమిచ్చాయి. స్థానిక సుర సముద్రంలో కాసింత వరదనీరు వచ్చి చేరింది.

## సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో మేడ్చల్ యువతికి కాంస్యం




కాంస్య పథకాన్ని అందుకున్న స్నేహ

**మేడ్చల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పాండిచ్చేరిలో ఈనెల 16 వ తేదిన నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ సర్కిల్ అత్వెల్లి కి చెందిన యువతి కాంస్యం పథకం సాధించింది. సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా లాంగ్‌జంప్ అండర్-18 విభాగంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించిన మండల స్నేహ ఈ పోటీల్లో పాల్గొని లాంగ్‌జంప్‌లో రాష్ట్రానికి కాంస్యపతకం సాధించిపెట్టారు. పతకం సాధించిన ఆమెను మేడ్చల్‌లో పలువురు అభినంధించారు.

## డిఈఓను కలిసిన ది భారత్ స్కౌట్స్ సభ్యులు



డిఈఓను కలిసిన స్కౌట్స్ సభ్యులు

**వికారాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ని శనివారం ది భారత్ స్కౌట్స్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ది భారత్ స్కౌట్స్ గైడ్స్ నూతన జిల్లా కమిటీ ఏర్పాటు విషయాన్ని సభ్యులు డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. వికారాబాద్ జిల్లాలో స్కౌట్స్ గైడ్స్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా భావం, సమిష్టి కృషి, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడం కోసం అవసరమైన విధివిధానాలపై చర్చించారు. స్కౌట్స్ గైడ్స్ కార్యకలాపాలను జిల్లాలో మరింత విస్తృతంగా అభివృద్ధి చేయాలనే ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగాలని డీఈఓ తెలిపినట్లు సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ సభ్యులు వి.సునీల్‌కుమార్, వెంకటయ్య, రమేష్, లక్ష్మీకుమారి, పద్మజ, నందిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ ఎరువులుగా జీవ ఎరువులు

**-శాస్త్రవేత డా.భారతి**

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
రైతులు రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువులను వాడాలని శాస్త్రవేత్త డా,భారతి సూచించారు. శనివారం పెద్దేముల్‌మండలం మంబాపూర్ రైతువేదికలో ఎటిఎంఎ ఆర్‌పిఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.భారతి మాట్లాడుతూ వరి పంటలో అజోస్పైరిల్లం, అలాగే పత్తి, కంది, వరి తదితర పంటల్లో పిఎస్‌బి రైజోబియం వంటి జీవ ఎరువుల వినియోగం, ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయంలో పంచగవ్య వినియోగం, తయారీవిధానంపై అవగాహన కల్పించారు. ఎటిఎంఎ చైర్మెన్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతివ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భార్గవి, తాండూరు ఎడిఎ అరుణ, మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్, ఆదర్శరైతు నారాయణ, ఏఈఓలు చంద్రకళ, దేవేందర్, బిటిఎం శ్రవన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ దుకాణాల బహిరంగవేలం ఈ నెల 26వ తేదీకి వాయిదా: కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న కమిషనర్, కౌన్సిలర్లు, నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరగవలసిన మున్సిపల్ దుఖాణాల బహిరంగ వేలంను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. అయితే ఆశించినన్ని దరఖాస్తులు అందకపోవటంతో మున్సిపల్ చైర్మన్ జాము రవి, కౌన్సిల్ సభ్యుల సూచనల మేరకు వేలంలో పాల్గొనే అభ్యర్థులకు మరింత దరఖాస్తుల స్వీకరణకు గడువును ఇచ్చినట్లు కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపల్‌పరిధిలో 77దుకాణాలు ఉన్నట్లు వీటి నిర్వహణకు 19న బహిరంగ వేలం వేయటానికి నిర్ణయించి ధరఖాస్తులు కోరటం జరిగిందని అన్నారు. ఆశించినస్థాయిలో దరఖాస్తులు, డిడిలు అందకపోవటంతో వేలం వాయిదావేసి ఈ నెల 25వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరించటానికి, 26న బహిరంగ వేలం ఉదయం 11గంటలకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ నెల 19నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు, నిబంధనల ప్రకారం షరుతులకు అనుగుణంగా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జాము రవితో పాటు కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, నవీన్, నాయకులు దోసకాయల వెంకటేశం, రాంరెడ్డి, జగన్నాథం, వైద్యనాథ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ లింగం మృతిపట్ల సంతాపం తెలిపిన చైర్మన్

**-అంత్యక్రియల్లో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్, కమిషనర్**

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
మూడుచింతలపల్లి మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ గజ్జల లింగం అనారోగ్యంతో ఉండి మృతిచెందటంతో ఆయన మృతిపట్ల మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్ సందర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరంలో మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ గజ్జల లింగం మృతిచెందటంతో ఆయననివాసంవద్ద ఉన్న పార్థీవదేహం (భౌతికకాయంపై) చైర్మన్ జాము రవి పూలమాలవేసి ప్రగాఢసంతాపాన్ని తెలియజేశారు. అంత్యక్రియల కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేశ్, నాయకులు భూమేశ్‌గౌడ్‌లు పాల్గొని బాధితకుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి, మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ గజ్జల లింగం మృతిచెందటంతో బాధితకుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.21వేల అందజేశారు. ఆ తరువాత అంత్యక్రియల కార్యక్రమంలో వారితోపాటు పలువురు స్థానికులు కూడ పాల్గొన్నారు.

## కోస్గిలో నిర్వహించే సభకు భారీగా తరలిరావాలి

**-తెలంగాణ రక్షణ సేన కొడంగల్ నియోజకవర్గ నేత రాజాప్రభాకర్ పిలుపు**

**దౌల్తాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
కొడంగల్‌నియోజకవర్గం కోస్గిలో నేడు అత్యంతప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పంచజన్య సంకల్పసభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన కొడంగల్ నియోజకవర్గనేత రాజాప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ సభకు పార్టీ అధ్యక్షురాలు కవితక్క ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు,ఆలోచనలు,భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నట్లు వారు తెలిపారు. భారీ సంఖ్యలో తరలిరావాలని, సభను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

## బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య..వరకట్న వేధింపులు

**-భవనంపై నుంచి దూకి..భర్త కానిస్టేబుల్ రిమాండ్**

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
భర్త వేధింపులు తాళలేక ఓవివాహిత విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మధుసూదన్‌రెడ్డి కూతురు పల్లవి (20) ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కేపీఆర్‌ఐటీ కళాశాలలో బీటెక్ (సీఎస్‌ఈ) 3వ సంవత్సరం చదువుతున్నది. మోటకొండూరు మండలం చందనపల్లికి చెందిన బద్దం శ్రీకాంత్‌రెడ్డితో ఆగష్టు 30న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి బోడుప్పల్‌లో ఉంటూ చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా పెళ్లయిన కొద్దిరోజులకే భర్త శ్రీకాంత్‌రెడ్డి ఆమెను అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశాడు. దీంతో పల్లవి తన పుట్టింటికి కాటేపల్లికి వెళ్లడంతో గత కొన్ని రోజులుగా కళాశాలకు రాలేదని ఈనెల 17 న వచ్చిందని తెలిపారు. భర్త వేధింపుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన పల్లవి ఈనెల 18న ఉదయం కళాశాలకువచ్చి తీవ్రమానసిక ఒత్తిడిలో ఉంది. సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత విద్యార్థులందరూ వెళ్లిపోగా, 4:30 గంటల సమయంలో డి బ్లాక్ 3వ అంతస్తు నుండి ఆమె కిందకు దూకింది. కళాశాలలో ఉన్న రవీందర్‌బాబు అనే వ్యక్తి ఆమెను గమనించి పెద్దగా కేకలువేసి ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె కిందకు దూకేసింది. దీంతో పల్లవి తల, చేతులకు తీవ్రగాయాలు కాగా కళాశాల సిబ్బంది వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జోడిమెట్ల నీలిమ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం మేడిపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10:07గంటలకు ఆమె మృతిచెందింది. పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించి పల్లవిభర్త శ్రీకాంత్‌రెడ్డిని అరెస్ట్‌చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి సంధ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు వరకట్నమరణంగా కేసు నమోదుచేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు. పల్లవి ఆత్మహత్యతో కళాశాల విద్యార్థులు, ఆమె కుటుంబసభ్యులలో తీవ్రవిషాదం నెలకొంది. కళాశాల విద్యార్థిని మృతితో శనివారం కేపీఆర్‌ఐటీ యాజామాన్యం కళాశాలకు సెలవు ఇచ్చారు. పల్లవి ఆత్మహత్యకుగల కారణాలపై విద్యార్థులు వివిధ కోణాల్లో చర్చించుకుంటున్నారు.

## వార్డు సభ్యుల సంఘం ఎన్నిక



సంఘం అధ్యక్షుడు సురేష్‌కు పత్రం అందజేస్తున్న సంఘంనేతలు

**నందిగామ, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
నందిగామ వార్డ్ మెంబర్ల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన శివగళ్ళ సురేష్‌కు శనివారం మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంఘంవ్యవస్థాపకురాలు నాగబేల్లి జ్యోతి, రంగారెడ్డిజిల్లా వార్డుసభ్యుల సంఘం ఇన్చార్జి గ్యార సురేష్‌లు నియామకపత్రం అందజేశారు. మండల వార్డు సభ్యులందరికి అందుబాటులో ఉండి వారిసమస్యల సాధన కోసం, గ్రామాల అభివృద్ధికి కృషిచేసి అధ్యక్షునిగా మంచి పేరు తెచ్చుకోవాలని ఆమె సూచించినట్లు మండల అధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఈసందర్భంగా మండల వార్డుసభ్యుల సంఘం అధ్యక్షులుగా నియమితులైన సురేష్‌ను అభినందిస్తూ వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగవెల్లి జ్యోతి శాలువాతో సన్మానించారు.

## ఇన్స్పెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గిరిజననేత



ఇన్స్పెక్టర్‌కు మొక్కను బహుకరిస్తున్న విజయ్ నాయక్

**నందిగామ, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
నందిగామ మండలం సిడి తండా గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగడ్డ తండాకు చెందిన రాజకీయ, వ్యాపారవేత్త జెటావత్ విజయ్‌నాయక్ శనివారం ఉదయం నందిగామ ఇన్స్పెక్టర్ వీరబాబును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహూకరించారు. ఇన్స్పెక్టర్‌ను కలిసిన వారిలో బిఆర్‌ఎస్ యువనాయకుడు జటావత్ పరశుర్నానాయక్ ఉన్నారు.

## లాటరీ పద్ధతిని రద్దుచేయాలి

**-సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విన్నపం**



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో లాటరీ పద్ధతిని రద్దుచేసి అర్హులైన వారికి నిజ నిర్ధారణ చేసి వారికి డబల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలసి విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎన్.రాజు, పట్టణ కార్యదర్శి శ్రీనునాయక్‌లు మాట్లాడుతూ గత లిస్టులో కొంతమంది లబ్ధిదారులు లిస్టులో పేర్లు ఉన్నా, అది ఇవ్వకుండా నేడు పట్టణంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అనుచరులకు మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వడం ఏంటి? ఫోర్‌వీలర్స్ మోటార్‌వాహనాలు ఉన్నవారిని అర్హులజాబితాలో ఎలా చేరుస్తారు? అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అర్హులైన వారికి వెంటనే ఇళ్లు కేటాయించాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాం. లేనిచో ఈ విషయంపై కోర్టుకు వెళ్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అర్హులైనవారికి డబల్ బెడ్‌రూమ్ ఇవ్వనిచో, త్వరలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈశ్వర్‌నాయక్, నాయకులు కావాలి రాజు, లక్ష్మి, పార్వతమ్మ, పారిజాత, మీనాజ్ బేగం పాల్గొన్నారు.

## ఎవరి జనాభా ఎంతో.. వారి వాటా అంతే..

**-బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్**



మాట్లాడుతున్న బిఎస్పీ నాయకులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
బహుజనులకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని బహుజన్‌సమాజ్ పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎవరి జనాభా ఎంతో వారికి రాజకీయంగా అంతే వాటా ఉండాలన్నదే బిఎస్పీ నినాదమని తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ఎన్‌ఆర్‌గార్డెన్స్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థాయి సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ అధ్యక్షుడు గుండె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి పల్లాటి రాములు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం ఉండటం లేదని బిఎస్పీ తరపున ప్రశ్నించారు. ఎవరి జనాభా ఎంతో.. వారి వాటా అంతే అనే నినాదంతో బహుజనుల హక్కులకోసం బిఎస్పీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. మాన్యవర్ కాన్షీరాం వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న బడంగ్‌పేట్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని దొడ్డి శ్రీనివాస్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాన్ని నాయకులతో కలిసి విడుదల చేశారు. సమావేశంలో బిఎస్పీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి గార మల్లేష్, జిల్లా కార్యవర్గసభ్యులు కంబాలపల్లి శాంతా, చిత్రం కృష్ణ, అసెంబ్లీ ఇన్‌చార్జులు వంగల కృష్ణప్రసాద్, బంగారి గల్లా మహేందర్, అసెంబ్లీఉపాధ్యక్షులు గడుసు ప్రవీణ్, నాయకులు కొంద్రు రఘుపతి, చెరుకూరి కరుణాకర్, నల్ల పరమేష్, గోరేటి కుమార్, చెక్క సతీష్, చెక్క శ్యాం, పెద్ద ముత్తుని గణేష్, లపంగి రాజు, భూతం రమణ, మల్లెల రఘు, సీనియర్‌నాయకులు మహేష్ పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణను తగ్గించాలని బాధితుల వినతి

**దుద్యాల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
దుద్యాల్ గ్రామంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణతో ఇళ్లు కోల్పోయి సుమారు 90 కుటుంబాలు నిర్వాసితులయ్యే పరిస్థితి ఉందని బాధితులు ఆందోళన వ్యక్తంచేశారు. రోడ్డు వెడల్పును పునఃపరిశీలించి తగ్గించిన తర్వాతే పనులుచేపట్టాలని కోరుతూ గ్రామకార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, జిల్లా ప్రధానకార్యదర్శి మెరుగు వెంకటయ్య, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌కు వినతిపత్రాలు అందించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతే తీవ్ర ఆర్థికనష్టంతో పాటు నిర్వాసితులుగా మారాల్సి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ద్వారా సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రోడ్డువెడల్పు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల నివాసాలు, జీవనోపాధికి నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు.